

## అనుబంధాల సుమగంధం తేరాతేజీ
చారిత్రక కంభం చెరువు కట్టపై ఈనెల 8వ తేదీన తేరాతేజీ ఉత్సవం జరగనుంది. - 8లో..



## ప్రిన్సిపాల్ నిర్వాకం.. పీడీకి సంకటం
ముండ్లమూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాఠశాల పీడీని నెల రోజులుగా విధులకు రానీయకుండా అడ్డుకుంటున్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37 /28

## వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్


### ట్రిపుల్ ఐటీలో అంతర్గత విచారణ
ఒంగోలు టౌన్: ఒంగోలులోని ఎస్ఎస్ఎన్ ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఒక ఫ్యాకల్టీ వ్యవహార శైలి మీద రెండు రోజులుగా విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కళాశాలలో పనిచేస్తున్న ఒక ఫ్యాకల్టీ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థిని తరగతి గదిలోనే కులం పేరుతో దూషించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో సుమారు 350 మంది విద్యార్థులు వీసీకి ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఇటీవల సీనియర్ విద్యార్థులకు, జూనియర్ విద్యార్థులకు మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయంపై సాక్షిలో కథనం రావడంతో పోలీసు అధికారులు కళాశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో ఎలాంటి సమస్య వచ్చినా తమకు ఫిర్యాదు చేయాల్సిందిగా కళాశాల ఆవరణలో పోలీసులు ఒక ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేశారు. ఈ బాక్సులో కూడా విద్యార్థులు సదరు ఫ్యాకల్టీ మీద ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదుగురు సభ్యులతో కూడిన ఒక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసి రహస్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఎత్తేయడం తెలిసిందే. ఆ తరువాత అప్పటి నుంచి ప్రశాంతంగా ఉన్న ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌లో తరచుగా ఘర్షణలు జరగడం మొదలైంది.

### క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు
ఒంగోలు సబర్బన్: ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో అనధికార లే అవుట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకునేందుకు గడువు పొడిగించినట్లు పట్టణాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ క్రమబద్ధీకరణ నిబంధనలు ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు రిజిస్టర్ అయిన అనధికార ప్లాట్లు / లే-అవుట్లకు వర్తిస్తాయన్నారు. లే అవుట్ /అనధికారికంగా విభజించిన స్థలంలో కనీసం ఒక ప్లాటు జూన్ 30వతేదీలోపు అమ్మకం జరిగి ఉండాలన్నారు.

# ఎక్సైజ్‌లో పచ్చ పెత్తనం

ఎక్సైజ్ శాఖలో పచ్చ పెత్తనం పెచ్చుమీరిపోయింది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో కొందరు అధికారులు పనిచేస్తున్నారు. అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన కొందరు ఉద్యోగులే బరితెగిస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతూ ప్రశ్నించిన ఉన్నతాధికారులపై సైతం తిరగబడుతున్నారు. కానిస్టేబుళ్ల నుంచి సీఐ స్థాయి అధికారుల వరకూ అందరిదీ ఇదే తీరు. ఈ ప్రభుత్వం మాది మేమేం చేసినా చెల్లుబాటవుతుందన్న అహంకారంతో వ్యవహరించడం విమర్శల పాలవుతోంది.

- ఉన్నతాధికారులను సైతం లెక్క చేయని కిందిస్థాయి సిబ్బంది
- సూపరింటెండెంట్‌తో ఒంగోలు ఎక్సైజ్ సీఐ వాగ్వాదం
- అధికార పార్టీ అండదండలతో పొదిలి ఎక్సైజ్ సీఐని దూషించిన ఎస్సై
- ఎక్సైజ్ శాఖలో పెత్తనం చెలాయిస్తున్న టీడీపీ మద్దతు సీఐలు
- డీసీ కార్యాలయంలోని ఒక ఎల్లో సీఐ ఫిర్యాదుతోనే గతంలో ఈఎస్ ఖాజా మొహిద్దిన్‌పై వేటు ?
- సుమారు రూ.2.50 కోట్లు కాజేసిన అధికారపార్టీ సామాజిక వర్గానికి చెందిన కానిస్టేబుల్



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనా వ్యవస్థ కుప్పకూలిపోయింది. రాజకీయ జోక్యం మితిమీరడంతో అధికారులు చేష్టలుడిగి చూడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. అన్నీ ప్రభుత్వ శాఖల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పచ్చపార్టీ కార్యకర్తలు, నాయకులు నేరుగా ప్రభుత్వాధికారులను ఆదేశిస్తున్నారు. అవసరమైతే బెదిరింపులకు దిగుతున్నారు. ఎక్సైజ్ శాఖలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఆ శాఖలో పనిచేస్తున్న అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులే బరితెగించి ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న పరిణామాలను ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొనవచ్చు. జిల్లా కేంద్రంలోని ఎలైట్ మాల్‌లో ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్ గుట్టు చప్పుడు కాకుండా రూ.2.50 కోట్ల మేర అవినీతికి పాల్పడినట్లు బయటపడింది. అయినా ఆయన మీద ఈగ వాలకుండా కూటమి ప్రభుత్వం కాపు కాయడం చూసి ప్రజలు నోటిమీద వేలేసుకున్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన మరికొందరు ఉద్యోగులు ఉన్నతాధికారులపై తిరగబడి మాట్లాడడం లాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. ఇటీవల ఒంగోలు ఎక్సైజ్ సీఐ ఒకరు ఏకంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో వాదన పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎవరైనా ఇదేం పద్ధతి అనిఅడిగితే మమ్మల్నెవరురా ఆపేది అంటూ కాలరెగరేస్తున్నట్లు సహోద్యోగులు చెప్పుకుంటున్నారు. ఈ ప్రభుత్వం మాది మేమేం చేసినా చెల్లుబాటవుతుందన్న అహంకారంతో వ్యవహరించడం విమర్శల పాలవుతోంది.

### ఈఎస్‌ను లెక్కచేయని అబ్కారీ సీఐ..
జిల్లా కేంద్రమైన ఒంగోలు ఎక్సైజ్ సీఐ వ్యవహార శైలి చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన సీఐ లీనా గత కొంతకాలంగా ఉన్నతాధికారులకు సహకరించడం లేదని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం పోలీసు స్టేషన్ తనిఖీ నిమిత్తం వెళ్లారు. రికార్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని ప్రశ్నించారు. రికార్డులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. రికార్డులు ఇవ్వడానికి సీఐ తిరస్కరించడమే కాకుండా ఈఎస్ పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఈఎస్ ఎదుటే చేతిలోని సెల్‌ఫోన్‌ను నేలకు విసిరి కొట్టి ఆగ్రహంతో ఊగిపోయారు. తనపై అధికారితో దురుసుగా ప్రవర్తించడంతో అక్కడ ఉన్న ఉద్యోగులు విస్మయానికి గురయ్యారు. విధి నిర్వహణలో వైఫల్యం చెందడమే కాకుండా జిల్లా అధికారి పట్ల దురుసుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈఎస్ మీద దురుసుగా ప్రవర్తించిన సీఐ లీనాను కమిషనరేట్‌లో సరెండ్ మాత్రమే చేశారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉందన్న అహంకారంతోనే సదరు సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారని కొందరు కిందిస్థాయి ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఇదేరీతిలో తాము వ్యవహరించి ఉంటే ఇప్పటికే సస్పెండ్ చేసి ఉండేవారని అంటున్నారు.

### పాత ఈఎస్‌ను సాగనంపారు...
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈఎస్‌గా షేక్ ఖాజా మొహిద్దిన్‌ను పోస్టింగ్ ఇచ్చారు. ఆయన వచ్చినప్పటి నుంచి కూటమి నాయకులకు సానుకూలంగా వ్యవహరించారు. మీడియాతో మాట్లాడే సమయంలో కూడా తన స్వామి భక్తిని దాచుకోకుండా కూటమి పాట పాడేవారు. ఎంత పచ్చసేవలో పావనమైనప్పటికీ ఆయనను అధికార పార్టీ సామాజిక వర్గం వదిలిపెట్టలేదని ప్రచారం జరుగుతోంది. డీసీ కార్యాలయంలో పనిచేసే అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన ఒక సీఐ ఆయనపై పెత్తనం చేయడానికి ప్రయత్నించినట్లు సమాచారం. దీన్ని ఆయన అంగీకరించకపోయే సరికి కథ అడ్డం తిరిగింది. అప్పటిదాకా మావాడే అనిచెప్పిన తమ్ముళ్లు ఆయనను సాగనంపేందుకు ప్లాన్ చేశారు. ఎల్లో సీఐ కనుసన్నల్లో కమిషనర్‌కు ఫిర్యాదులు పంపించినట్లు సమాచారం. అంతటితో ఊరుకోకుండా కమిషనర్ కార్యాలయంలో చక్రం తిప్పడంతో కూటమి ప్రభుత్వం ఖాజా మొహిద్దిన్ మీద వేటు వేసినట్లు తెలుస్తోంది. 2024 సెప్టెంబర్‌లో ఒంగోలులో ఈఎస్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన చేత అన్నీ రకాలుగా ఊడిగం చేయించుకొని కేవలం 9 నెలలకే ఇంటికి పంపించారు. తన పరిధికి మించి కూటమి సేవ చేసినా ఆయనకు ఇప్పటి వరకు పోస్టింగు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఎక్సైజ్ శాఖ ఉద్యోగులే చెప్పుకుంటున్నారు.

### పొదిలి ఎస్సై సస్పెండ్...
ఇటీవల పొదిలి ఎస్సై సైమన్‌ను సస్పెండ్ చేయడం ఎక్సైజ్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం జిల్లాలో టీడీపీ నాయకులు, కార్యకర్తలే మద్యం దుకాణాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఒక్కో మద్యం దుకాణానికి అనుబంధంగా కనీసం 10 నుంచి 15 బెల్ట్ షాపులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఇదంతా అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరుగుతోందని ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పొదిలి ఎక్సైజ్ ఎస్సై సైమన్‌కు ఒక వ్యక్తి వద్ద మూడు మద్యం బాటిళ్లు దొరికాయి. నిబంధనల ప్రకారం మూడు మద్యం బాటిళ్లు ఉండవచ్చు కనుక అతడిని ఆయన వదిలిపెట్టినట్లు సమాచారం. అయితే ఉన్నతాధికారులకు తెలియకుండా ఆయన బెల్ట్ షాపు నిర్వాహకుడిని పట్టుకొని వదిలేసినట్లు, ఈ విషయం గురించి ప్రశ్నించిన సీఐ అరుణకు మారిని దూషించినట్లు ప్రచారం జరిగింది. అయితే ఆయనను మాత్రం ఆఘమేఘాల మీద సస్పెండ్ చేశారు. దీని మీద ఎక్సైజ్ శాఖలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

### రూ.2.42 కోట్లు కాజేసినా చర్యల్లేవు...
జిల్లా కేంద్రమైన ఒంగోలులోని ఎలైట్ మాల్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ చౌదరి గుట్టు చప్పుడు కాకుండా రూ.2.42 కోట్లు నొక్కేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ విషయం బయటపడింది. ఇది రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. అయినా ఆయన మీద కేసు పెట్టడానికి కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కించింది. విచారణ పేరుతో రోజుల తరబడి కేసు నానబెట్టింది. రమణ అజ్ఞాతంలోకి వెళ్ల పోవడానికి అధికారులు సహకరించినట్లు అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఆయనను అరెస్టు చేయలేదు. కేవలం రికవరీ చేయడానికే ప్రాధాన్యత ఇచ్చింది. ఈ విషయం గురించి ఇటీవల ఈఎస్‌ను ప్రశ్నిస్తే రమణ ప్రస్తుతం సస్పెండ్‌లో ఉన్నారని చెప్పారు. నిజానికి ఆయనను ఎప్పుడు సస్పెండ్ చేశారో కూడా తెలియకుండా గుట్టుగా వ్యవహరించడం గమనార్హం. మొత్తం మీద జిల్లా ఎక్సైజ్ శాఖలో అధికార పార్టీ పెత్తనం చేస్తోందని, తాను కోరుకున్నట్లు జరుగకపోతే ఉన్నతాధికారులను సైతం లెక్కచేయకుండా కొందరు కింది స్థాయి ఉద్యోగులు మొండిగా వ్యవహరిస్తుండడంతో అధికారులు మదనపడుతున్నారని తెలుస్తోంది.

- నీ పాలనలో గుర్తుండే పథకం ఒక్కటి చెప్పు బాబు
- సూపర్‌సిక్స్ పథకాలంటూ ప్రజలను మరోసారి మోసం
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సభలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం

# నమ్మక ద్రోహం.. బాబు నైజం



ర్యాలీలో కోలాటం వేస్తున్న చెంచు యువకులు

పుల్లలచెరువు: తాము అధికారంలోకి వస్తే జగన్ కంటే రెండింతలు సంక్షేమ పథకాలు ఇస్తానని ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు సీఎం అయ్యాక ప్రజలకు నమ్మక ద్రోహం చేశారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం జిల్లా కార్యవర్గసభ్యుడు డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేయడం, అబద్ధాలు ఆడటం తప్ప రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే బాబు రాష్ట్రంలో ప్రజలకు గుర్తుండే పథకం ఏదైనా చేశాడా అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమం అంటే ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుర్తు చేసుకుంటారని అన్నారు. పేద ప్రజల వద్దకు పరిపాలన తెచ్చిన ఘనత జగనన్నకు దక్కుతుందని అన్నారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఒక్కసారి 50 వేల డాక్టర్ పోస్టులు ఇచ్చిన ఘనత జగనన్నదన్నారు. బాబు ష్యూరిటీ అంటూ ఎన్నికల్లో గెలవక ముందు ఒక్కొక్క ఇంటికి రూ.6 లక్షలు, రూ.5 లక్షలు ఇస్తానంటూ చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలంటూ 143 హామీలు అమలు చేస్తామని చెప్పి మళ్లీ ప్రజలను మోసం చేశారన్నారు. అడ్డగోలు హామీలిచ్చి గద్దెనెక్కిన తరువాత పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ పేరుతో స్వీయ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయించి వేధించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో వారి దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి క్యూ ఆర్‌కోడ్ లను ఆవిష్కరించారు. దీనిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.



క్యూఆర్ కోడ్ లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

### నియోజకవర్గంలో దోచుకోవడమే లక్ష్యంగా కూటమి నాయకులు:
నియోజకవర్గంలోని కూటమి నాయకులు చేయని దోపిడీ అంటూ లేదని, ఇసుక, మద్యం, బియ్యం లాంటి అక్రమ పనులు చేస్తూ దోచుకుంటున్నారని అన్నారు. గ్రామాల్లోకి ఇసుక రావాలంటే కప్పం కట్టందీ రాదని, వస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఇటీవల నియోజకవర్గంలో 20 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్‌ను జేసీబీలతో తవ్వుకుని కోట్ల రూపాయలు దోచుకునేందుకు కూటమి నాయకులు ప్లాన్ చేశారని, దానిని జిల్లా అధికారులకు తెలియజేసి ఆపేశామని అన్నారు.

### ఎస్టీలకు అన్యాయం:
నియోజకవర్గ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్టీకి కేటాయిస్తే దానిని అగ్రవర్ణాల వారికి కట్టపెట్టారని ఇది ఎస్టీలకు అన్యాయం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఇదే జగనన్న పరిపాలలో ఎస్సీ, ఎస్టీలకు తగిన న్యాయం జరిగిందని, చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీలు అంటే ఏహ్యాభావం ఉందని అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజనుల నృత్యాలతో స్వాగతం పలకగా, బస్టాండ్ సెంటర్ లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తల హర్షధ్వానాల మధ్య సభావేదికకు చేరుకున్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ బి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణ, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్.రాములు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జానకిరఘు, మాజీ ఎంపీపీ ఎం.సుబ్బారెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న మహిళలు, నాయకులు, కార్యకర్తలు

# కొండపిలో కూటమి అక్రమాలు

- సర్పంచ్ ఎన్నికలు జరగకుండా కుట్రలు
- వైఎస్సార్ సీపీ నాయకులపై బెదిరింపులు
- అధికారులపై మంత్రి, నాయకుల ఒత్తిళ్లు
- పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి అభ్యర్థులను బెదిరించారు
- ఎన్నికలు నిర్వహించే వరకూ పోరాడతాం
- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



విలేకరులతో మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్, పక్కన బత్తుల బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ అభ్యర్థి పల్లె మేరి

ఒంగోలు సిటీ: కొండపి సర్పంచ్ ఎన్నికల్లో కూటమి నేతలు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. బుధవారం ఆయన ఒంగోలు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పోలీస్ వ్యవస్థను అడ్డంపెట్టుకుని మంత్రి, నాయకులు అడ్డగోలుగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థుల దరఖాస్తులను ఫోర్జరీ సంతకాలతో ఎన్నికల అధికారికి సమర్పించి ఉపసంహరణల కుట్రలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల అధికారులను సైతం లొంగదీసుకుని ఈ అక్రమాలకు తెగబడ్డారని ఆయన ధ్వజమెత్తారు. సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు ముగ్గురు మహిళలు ముందుకు వచ్చారని, నామినేషన్ వేయకుండా వారిపై రకరకాలుగా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. వై కళ్యాణి, ఏ విమలమ్మ, పల్లె మేరి నామినేషన్లు వేశారని, నామినేషన్ల సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కళ్యాణి భర్త వసంతరావు పోలీస్ డిపార్టుమెంట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారని, ఆయన్ను సైతం భయాందోళనకు గురిచేసి బలవంతంగా నామినేషన్లు ఉపసంహరణ పత్రాలపై సంతకాలు చేయించారన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్పీ, కనిగిరి డీఎస్పీలకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే కళ్యాణిని ఎవరూ ఒత్తిడి చేయలేదని, ఆమే స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్నారని, వాటిని పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిందని డీఎస్పీ మాట్లాడడం సరికాదని ధ్వజమెత్తారు. ఉపసంహరణ పత్రాలు ఎన్నికల అధికారికి ఇస్తారు కానీ పోలీస్ స్టేషన్‌లో ఎందుకు ఇస్తారని ప్రశ్నించారు. అధికారపార్టీ నాయకుల బెదిరింపులకు భయపడి ఊరు విడిచి ఎక్కడో తలదాచుకున్న విమలమ్మ వద్దకు వెళ్లి టెర్రరిస్టులను వేటాడినట్టుగా వేటాడి వారి వద్ద నుంచి ఉపసంహరణ పత్రాలపై సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. సమయం ముగిసినా కూడా ఎన్నికల అధికారి విమలమ్మ లేకుండా ఆమె పత్రాలను తీసుకుని ఉపసంహరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇక పల్లెమేరి ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధమయ్యారని, నామినేషన్ వేసేందుకు రక్షణ కల్పించాలని కోరిందని, తాము వెళ్లి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఆమె సంతకాలు ఫోర్జరీ చేసి ఉపసంహరించేలా చేశారని ఆరోపించారు. తాను పోటీలో ఉన్నానని చెబుతున్నా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. కొండపిలో జరిగిన అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కొండపిలో పెద్ద ఎత్తున పోలీసులు మొహరించి వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. 4వ తేదీ రాత్రి నుంచి అధికార కూటమి నేతల అరాచకాలు ప్రారంభమయ్యాయన్నారు. ఉపసంహరణల సమయం గంట ముందు వరకూ తనతో ఫోన్లో మాట్లాడిన ఎన్నికల అధికారి తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారంటే ఆయన పై మంత్రి, నాయకులు ఎంత ఒత్తిడి తీసుకొచ్చారో అర్థమవుతోందన్నారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని నామినేషన్ల ప్రక్రియను రద్దు చేసి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి న్యాయబద్ధంగా ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. పులివెందులలో జెడ్పీటీసీ ఎన్నికల్లో దౌర్జన్యాలకు తెగబడడం, ఓటర్లను, పోటీలో ఉండే అభ్యర్థులను కూటమి నేతలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీపై జరిగిన దాడిని అందరూ ఖండించాలన్నారు. మాకు ప్రత్యర్థి అధికార కూటమా? అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్న అధికారులా? అన్న సందేహం కలుగుతోందన్నారు.

### నామినేషన్లు వేసిన నాటి నుంచి వేధింపులు..
సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి టీడీపీ నేతలు బెదిరింపులకు దిగారని పల్లె మేరి ఆరోపించారు. వారి చర్యలకు భయపడి ఊరు వదిలి వందల కిలోమీటర్లు దూరం వెళ్లి తలదాచుకున్నామని, తన భర్తను, పిల్లల్ని రకరకాలుగా వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. పోలీసులు, నాయకులు అందరూ టార్గెట్ చేశారని, అయినా తాను భయపడలేదని, ఫోర్జరీ సంతకాలతో నామినేషన్ ఉపసంహరణ పత్రాలు అధికారులకు ఇచ్చారని ఆరోపించారు. తాను ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, అధికారులు న్యాయం చేయాలని కోరారు.

### కూటమి ప్రభుత్వ బెదిరింపులు దారుణం:
ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛగా ఎన్నికలు జరగకుండా కూటమి ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడం దారుణమన్నారు. ఇటువంటి నియంతృత్వ విధానాలకు త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారని విమర్శించారు. కార్యక్రమంలో యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఢాకా పిచ్చిరెడ్డి, జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు కనపర్తి గోవిందమ్మ, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకటరావు, పల్లె శివరావు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు బచ్చల కోటేశ్వరరావు, చింతపల్లి హరిబాబు, పిన్నిక శ్రీనివాసరావు, ఇనకొల్లు సుబ్బారెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మారెం రెడ్డి గంగాధరరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీరవసంతరావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

- ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడిని ఖండించిన జంకె

మార్కాపురం/తర్లుపాడు: పులివెందుల జెడ్పీటీసీ ఉపఎన్నికల సమయంలో ఓటమి భయంతో కూటమి నాయకులు బరితెగించి బీసీ నేత ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నేత వేల్పుల రాముతోపాటు పలువురిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఉప ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే తమ నాయకులపై దాడి చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తోందని అన్నారు. ప్రజలకు ఏం చేయాలి.. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలి.. అనే అంశాన్ని



జంకె వెంకటరెడ్డి

మరచి రెడ్‌బుక్ పాలన నడిపిస్తున్నారని విమర్శిస్తున్నారు. బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి దిగడం దారుణమన్నారు. ఒక ఎమ్మెల్సీకి పోలీసులు కనీస భద్రత కల్పించలేరా అని ప్రశ్నించారు. పులివెందులలో శాంతి భద్రతలు కాపాడేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో బీసీ నాయకులపై దాడులు పెరిగాయని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ బీసీ నేత, పులివెందుల శాసనమండలి సభ్యుడు రమేష్ యాదవ్‌పై మంగళవారం టీడీపీ గూండాలు చేసిన దాడిని ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. ఇది బీసీలపై చేసిన దాడిగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టడం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. దాడి చేసిన నిందితులను ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అనుబంధాల సుమగంధం
# తేరాతేజీ




- తేరాతేజీ వేడుకలకు సిద్ధమవుతున్న చారిత్రాత్మక కంభం చెరువు
- పెళ్లినాటి దండలను నీటిలో వదిలి మొక్కులు తీర్చుకోనున్న నూతన వధూవరులు
- వరుస సెలవు దినాలు కావడంతో సందర్శకులు పోటెత్తే అవకాశం

**కంభం:** ఆధ్యాత్మికత, అనుబంధాలకు ప్రతీకగా భావించే తేరాతేజీ(గరిక తొక్కుడు) పండగకు చారిత్రాత్మక కంభం చెరువు కట్ట సిద్ధమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేవలం కంభంలో మాత్రమే నిర్వహించుకునే ఈ పండగకు ముస్లింలు భారీ సంఖ్యలో తరలివస్తారు. శుక్రవారం పండగ సందర్భంగా కొత్త జంటలు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో చెరువు కట్ట కోలాహలంగా మారనుంది.

**ఇదీ పండగ విశిష్టత**

ఏటా ఆగస్టులో నెల పొడుపు కనిపించిన 13వ రోజు తేరాతేజీ పండగను ముస్లింలు నిర్వహించుకుంటారు. తేరాతేజీ నెలను చేదు నెలగా చెబుతుంటారు. కొత్తగా వివాహం చేసుకున్న జంటలు నెల పొడుపు కనిపించినప్పటి నుంచి ఒకరి ముఖం ఒకరు చూసుకోకుండా 13వ రోజు తేరాతేజీ నాడు కంభం చెరువు కట్టపై కలుసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అక్కడే వారి పెళ్లినాటి దండలను నీటిలో వదిలి మొక్కులు తీర్చుకుంటారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేస్తారు. చెరువు కట్టపై ఉన్న దీనాషావళి దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. చెరువు కట్టపై ఉన్న పచ్చికను తొక్కితే ఆరోగ్యానికి మంచిదని ముస్లింల నమ్మకం. అందుకే గరికతొక్కుడు పండగగా పిలుస్తారు. చెరువుకట్టకు ఉదయాన్నే చేరుకుని సాయంత్రం వరకు అక్కడే గడిపి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో ఉన్న మామిడి చెట్ల ఆకులు తీసుకెళ్లి గుమ్మాలకు కట్టుకుంటుంటారు.

**పోటెత్తనున్న భక్తులు**

అధికారికంగా సెలవు దినం లేకపోయినా తేరాతేజీ పండగ కోసం ముస్లింలు ఎదురుచూస్తుంటారు. హైదరబాద్, గుంటూరు, కర్నూలు, బెంగళూరు తదితర దూరప్రాంతాల్లో స్థిరపడిన వారు పండగ రోజున కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన కంభం చేరుకుంటారు. అలాగే కర్నూలు, గుంటూరు, నంద్యాల, గిద్దలూరు, దొనకొండ, వినుకొండ తదితర ప్రాంతాలకు చెందిన ముస్లింలు కూడా చెరువు కట్టకు భారీ సంఖ్యలో తరలివస్తారు. ఇతర కులాలకు చెందిన వారు సైతం పిల్లలతో కలిసి సరదాగా చెరువు కట్టపైకి వచ్చి వెళ్తారు. రైలు మార్గంలో వచ్చే వారు కంభం చెరువు సమీపంలోనే రైళ్లను ఆపేసి అక్కడే దిగుతుంటారు. ఈ దఫా శుక్రవారంతోపాటు శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో మూడు రోజులపాటు ప్రజలు చెరువు కట్టకు వచ్చే అవకాశం ఉంది. అధిక సంఖ్యలో వాహనాలు వచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.


కంభం చెరువు కట్టపై దీనాషావళి దర్గా


కంభం చెరువులో పెళ్ళినాటి దండలు వదిలి మొక్కులు తీర్చుకుంటున్న కొత్తజంటలు(ఫైల్)

## మంత్రి హామీలు నీటి మూటలేనా.. ?

- మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకుల ప్రశ్న

**ఒంగోలు టౌన్:** సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు ఇస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఇచ్చిన హామీ కేవలం నీటి మూటేనా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొర్నిపాటి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించంచారు. ఈ సందర్భంగా కొర్నిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ...మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూలై 10 రోజుల పాటు సమ్మె నిర్వహించారని, అనంతరం జరిగిన చర్చల సందర్భంగా సమ్మె కాలపు వేతనాలను చెల్లిస్తామని మంత్రి చెప్పారని గుర్తు చేశారు. ఆయన ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. జిల్లాలో చనిపోయిన, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు అనేక మంది ఉన్నారని, ఆ స్థానంలో వారి కుటుంబసభ్యులకు ఉపాధి చూపాలని కోరుతుంటే అదుకు భిన్నంగా టీడీపీ కార్యకర్తలతో ఆయా స్థానాలను భర్తీ చేస్తున్నారని, ఇదేం న్యాయమని ప్రశ్నించారు. కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో తీసుకోవాలని, కనీస వేతనాలను అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. ఒంగోలులో మున్సిపల్ కార్మికులపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, సమస్యలు పరిష్కరించకుండా పనిభారాన్ని పెంచడం ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. మున్సిపల్ కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని, న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సామ్రాజ్యం, సుబ్బరాయుడు, పి.పద్మ, మరియమ్మ, ఏడుకొండలు, చెన్నమ్మ పాల్గొన్నారు.


మున్సిపల్ కార్మికుల ఫెడరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న కొర్నిపాటి

## అర్జీల ఆడిట్‌లో నిర్లక్ష్యం వద్దు

– కలెక్టర్ తమీమ్ అన్సారియా



**ఒంగోలు సబర్బన్:** గ్రీవెన్స్ అర్జీల ఆడిట్ విషయంలో నిర్లక్ష్యం వద్దని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. గ్రీవెన్స్ అర్జీలు పరిష్కారమవుతున్న తీరుతో పాటు పౌరసరఫరాలు, రెవెన్యూ సంబంధిత అంశాలపై బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జేసీ ఆర్ గోపాలకృష్ణతో కలిసి ఆమె సమీక్షించారు. ఆడిట్‌లో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల విషయంలో పెండింగ్ ఉండకూడదన్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నందున అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. వృద్ధులకు నేరుగా ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీలో పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. పేదలకు పంపిణీ చేసేందుకు ఇప్పటికే గుర్తించిన ప్లాట్లలో ఖాళీలు, సాంకేతిక ఇబ్బందులపైనా అధికారులతో ఆమె చర్చించారు. సమావేశంలో డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, డీఎస్‌ఓ పద్మశ్రీ, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి రవి, గ్రీవెన్స్ ఆడిట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## కమల దళంలో వర్గ పోరు!

- పార్టీలో గౌరవం దక్కడం లేదని సీనియర్ల ఆగ్రహం
- మైనారిటీ నేతలు, మహిళా నాయకులకు అవమానం
- జిల్లా అధ్యక్షుడు సెగ్గెంతో ఇతర నేతలకు పొరపొచ్చాలు
- నేడు రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఒంగోలు రాక
- ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో నేతల మధ్య మాటల యుద్ధం
- పరిస్థితులు ఎటుదారితీస్తాయోనని పార్టీ నేతల్లో అంతర్మథనం

**ఒంగోలు సబర్బన్:** కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామి అయిన బీజేపీలో నేతల మధ్య వర్గ పోరు బట్టబయలైంది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సెగ్గెం శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే పార్టీలో లుకలుకలు మొదలైనట్లు తెలుస్తోంది. పార్టీ పదవుల విషయంలో లోలోపల రగిలిపోతున్న నాయకులు ఇన్నాళ్లూ కిమ్మనకుండా ఉన్నప్పటికీ తాజా పరిణామాలు వారిలో మరింత ఆగ్రహాన్ని తెప్పించాయి. ఇటీవల జిల్లా పార్టీ పూర్తి స్థాయి కమిటీని జిల్లా అధ్యక్షుడు ప్రకటించిన దరిమిలా విభేదాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తొలిసారి గురువారం ఒంగోలు వస్తున్నారు. ఈ నేపథ్యంలో బుదవారం 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు తదితరులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడితో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి యానం యోగయ్య యాదవ్, పార్టీ నాయకుడు బొద్దులూరి ఆంజనేయులు మధ్య మాటల యుద్ధం కొనసాగింది. అందరు నాయకులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలంటూ జిల్లా అధ్యక్షుడిపై ఒంగోలు ఇన్‌చార్జి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదే సమయంలో కొందరు నేతలు లంకా దినకర్ పెత్తనంపై రుసరుసలాడినట్లు తెలిసింది. బొద్దులూరి ఆంజనేయులు, యానం చిన యోగయ్య యాదవ్ 'నువ్వెంత అంటే.. నువ్వెంత' అంటూ కేకలు వేసుకోవడంతో మిగిలిన నేతలు తలపట్టుకున్నారు.

**సెగ్గెం తీరుతోనే విభేదాలు!**

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం ఏకపక్ష వైఖరే పార్టీలో విభేదాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అతనికి అనుకూలమైన వ్యక్తులకు పదవులు కట్టబెట్టి, పార్టీ కోసం పనిచేస్తున్న వారిని పక్కనబెడుతున్నారని కొందరు నాయకులు ఆరోపిస్తున్నారు. మైనార్టీ సెల్ నగర మాజీ అధ్యక్షుడు ఖాదర్ కూడా తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలో తన ఫొటో లేదని, సమావేశంపై కనీస సమాచారం కూడా ఇవ్వలేదని జిల్లా అధ్యక్షుడి తీరుపై నిప్పులు చెరిగారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో గురువారం ఒంగోలు ఎమ్ఎస్ కల్యాణ మండపంలో రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొనే సభలో ఏం జరుగుతుందోనని బీజేపీ నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ఒంగోలు టౌన్:** నగర శివారులోని జగనన్న లేఔట్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం... నగర శివారులోని అగ్రహారంలో జగనన్న లే ఔట్లో నీటి గుంతలో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అయితే కొత్తపట్నం మండలం పోలీసు స్టేషన్లో మూడు రోజుల క్రితం ఒక మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. పోలీసులు వారికి సమాచారం ఇచ్చారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బాబును నమ్మితే మోసం గ్యారంటీ


ఎర్రగుడిపాడులో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మేరుగు నాగార్జున

**చీమకుర్తి రూరల్:** మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని ఎర్రగుడిపాడు, మంచికలపాడు, బండ్లమూడి గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అనే పథకాలతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలుపొందిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హామీలను తుంగలో తొక్కి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అనంతరం చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూర్ కోడ్ కలిగిన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాస రావు ఉపాధ్యక్షుడు యనం శేషరెడ్డి శ్రీధర్ల శేషు, సీనియర్ నాయకులు ఓబుల్ రెడ్డి మాస్టారు, జి. ఓబుల్ రెడ్డి, గంగిరేకుల వెంకటరావు, నల్లూరి చంద్ర, మొగిలిచెట్టి వెంకటేశ్వర్లు, పొన్నపల్లి సుబ్బారావు, పెరికల నాగేశ్వరరావు, పొన్నపల్లి నాగేశ్వరరావు అత్యాల అంకయ్య మాగులూరి ఇమ్మానియేల్, జడ రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స.హ చట్టంపై అవగాహన అవసరం

**ఒంగోలు సబర్బన్:** సమాచార హక్కు చట్టంపై ప్రకృతి వ్యవసాయ రైతులు, సిబ్బంది అవగాహన పెంపొందించుకోవాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిణి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం సమాచార హక్కు చట్టంపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స.హ చట్టం ఉద్దేశం, పౌరులు సమాచారం పొందే విధానం, అధికారుల విధులు, బాధ్యతలను వివరించారు. ఈ చట్టం ద్వారా ప్రజలు తమ హక్కులను ఎలా వినియోగించుకోవచ్చు, పాలక వ్యవస్థలో ఎలా జవాబుదారీతనం తీసుకురావచ్చో ఉదాహరణలతో విశదీకరించారు. ఈ సందర్భంగా పలువురి సందేహాలను నివృత్తి చేశారు.

## సాగర్ కాలువలో యువకుడు గల్లంతు


సాగర్ కాలువ వద్ద గాలిస్తున్న బంధువులు

**దొనకొండ:** సాగర్ కాలువలో ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తూ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఈ సంఘటన బుధవారం దొనకొండ మండలంలోని చందవరం గ్రామ సమీపంలో సాగర్ కాలువ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. దొనకొండ మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బెజవాడ మనోజ్, ఎనిబెర నాని, దానియేల్ అనే ముగ్గురు యువకులు ఈత నేర్చుకునేందుకు కాలనీ నుంచి 3 కిమీ దూరంలో ఉన్న చందవరం సమీపంలోని సాగర్ కాలువ వద్దకు వెళ్లారు. ఇటీవల కాలువకు నీరు విడుదల చేయడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. గట్టుపై కూర్చున్న బెజవాడ మనోజ్(18) ఈత కొట్టాలనే తాపత్రయంతో కాలువలోకి దిగాడు. నీటి ప్రవాహ ఉధృతికి మనోజ్ కొట్టుకుపోతుండగా గట్టుపై ఉన్న స్నేహితులు పెద్ద పెట్టున కేకలు వేశారు. వారికి ఈత రాకపోవడంతో కాలువలోకి దిగేందుకు సాహసించలేదు. కనుచూపు మేరలోనే నీటి ప్రవాహంలో మిత్రుడు గల్లంతవడంతో కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు హుటాహుటిన సాగర్ కెనాల్ వద్దకు వెళ్లి గాలించినా మనోజ్ ఆచూకీ లభ్యం కాలేదు. చేతికందివచ్చిన కుమారుడు కాలువలో గల్లంతవడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.


మనోజ్ (ఫైల్)

## క్లుప్తంగా

### హత్య కేసు కొట్టివేత

మార్కాపురం టౌన్: హత్య కేసులో నేరం రుజువు కానందున కేసు కొట్టివేస్తూ ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శుభవాణి తీర్పు ఇచ్చినట్లు నిందితుల తరఫున న్యాయవాదులు లక్ష్మీకుమార్‌రెడ్డి, భూపని కాశయ్య, పురుషోత్తమ నాయక్ బుధవారం తెలిపారు. వివరాలు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖమ్మం పట్టణానికి చెందిన సద్దుల గౌరి అలియాస్ గీత చీరల వ్యాపారం చేసుకుంటూ వివిధ ప్రాంతాల్లో తిరుగుతుండేది. ఈ క్రమంలో జిల్లాలోని తాళ్లూరు మండలం దారంవారిపాలెం గ్రామానికి చెందిన ఎడ్లపల్లి అచ్చయ్యతో ఏర్పడిన పరిచయంతో సన్నిహితంగా మెలిగేది. వీరి మధ్య బేధాభిప్రాయాలు రావడంతో తేతపూడి వజ్రయ్య, కోటయ్య, అచ్చయ్య కలిసి 2010 ఆగస్టు 21న తాళ్లూరు మండలం తురకపాలెం గ్రామ పొలాల్లో ఆమెను గొంతునులిమి చంపారని తాళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే కేసులో సాక్ష్యలను విచారించిన తర్వాత నిందితులపై నేరం రుజువు కానందున కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు న్యాయవాదులు తెలిపారు.

### మద్యం తాగి వాహనాలు నడపొద్దు

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు టౌన్: మద్యం తాగి వాహనాలు నడపి భవిష్యత్తును దెబ్బ తీసుకోవద్దని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. రాచర్ల మండలంలో మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిని గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా 50 రోజుల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక నుంచి జిల్లాలో రోజూ వాహనాలు తనిఖీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తలిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతి చెందిన మోషే

దొనకొండ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..దర్శి మండలం కట్టుబడివారిపాలెం గ్రామానికి చెందిన గర్నెపూడి మోషే (25) టెంట్ హౌస్ సప్లయర్స్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దొనకొండలోని బేతేలుపురానికి చెందిన రమ్యతో ఏడాది క్రితం వివాహమైంది. దొనకొండలో ఉన్న భార్య దగ్గరకు వచ్చిన మోషేకు తమ్ముడుకు బాగా లేదనే సమాచారంతో మంగళవారం రాత్రి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. చిన్నగుడిపాడు గ్రామం సమీపంలోని మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. రాత్రి కావడంతో ఆలస్యంగా గుర్తించారు. మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. చికిత్స పొందుతూ మోషే మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై టి.త్యాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### డిజిటల్ అసిస్టెంట్‌పై పంచాయతీ కార్యదర్శి వేధింపులు

- అధికారుల ముందే పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన మహిళ

**తాళ్లూరు:** తాళ్లూరు సచివాలయం-1 డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళపై అదే సచివాలయంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి వేధింపులకు గురిచేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వేధింపుల గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియక సదరు మహిళా డిజిటల్ అసిస్టెంట్ మదనపడుతోంది. ఈ క్రమంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సదరు మహిళా డిజిటల్ అసిస్టెంట్..కార్యక్రమానికి హాజరైన అధికారుల ముందు తన ఆవేదన వ్యక్తం చేసింది. పంచాయతీ కార్యదర్శి ఏ విధంగా వేధిస్తున్నారో వివరించి అధికారుల ముందే అతన్ని నిలదీసింది. దీంతో ఏం చేయాలో తెలియని పంచాయతీ కార్యదర్శి నీళ్లు నమిలాడు. పంచాయతీ కార్యదర్శి ఏ విధంగా వేదిస్తున్నాడో ఫోన్‌లో ఉన్న ఆధారాలను అధికారులకు చూపించింది. విషయం తెలుసుకున్న సదరు మహిళ కుటుంబసభ్యులు అక్కడకు చేరుకొని పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహంతో ఊగిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని చెదరగొట్టారు. సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పారు.

## అంతా నా ఇష్టం..!

ఈ ఫొటోలో గేటు బయట దీనంగా ఎదురుచూస్తున్న వ్యక్తి ఎవరో కాదు. ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు. గత ఏడు సంవత్సరాలుగా పాఠశాల విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన ఘనత ఆయనిది. కానీ అదే ఆయనకు చేటు తెచ్చిపెట్టింది. పాఠశాల ప్రిన్సిపాల్ సదరు వ్యాయామ ఉపాధ్యాయుడిపై కక్ష కట్టి పాఠశాలలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు. పీడీ రామారావును విధుల్లోకి తీసుకోవాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించినా ఆ ప్రిన్సిపాల్‌కు అవేం పట్టడం లేదు. నన్ను ఎవరేం చేయలేరన్న భావనలో ఆయన వ్యవహార శైలి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులే ఆరోపిస్తున్నారు.


మోడల్ స్కూల్ ఎదుట పడిగాపులు కాస్తున్న పీడీ రామారావు

### ప్రిన్సిపాల్ నిర్వాకం.. పీడీకి సంకటం

- మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఇష్టారాజ్యం
- నెల రోజులుగా పీడీపై కక్ష సాధింపు
- రెన్యువల్ ఆర్డర్ వచ్చినా విధుల్లోకి తీసుకోకుండా ఇబ్బందులు
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- ప్రిన్సిపాల్ వైఖరిపై సర్వత్రా విమర్శలు

**ముండ్లమూరు(దర్శి):** ముండ్లమూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాల్సిన ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే..ముండ్లమూరు మోడల్ స్కూల్‌లో 2018 నుంచి వ్యాయామ ఉపాధ్యాయునిగా రామారావు పనిచేస్తున్నారు. పీడీ రామారావు అప్పటి నుంచి పాఠశాల విద్యార్థులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా సైతం తీర్చిదిద్దారు. రామారావు శిక్షణ జాతీయస్థాయిలో ఒకరు, రాష్ట్రస్థాయిలో నలుగురు, జిల్లా స్థాయిలో ఎంతో మంది విద్యార్థులు పాఠశాలలో రామారావు వద్ద శిక్షణ తీసుకొని రాణించారు. మండల స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు క్రీడల్లో విద్యార్థులకు మంచి గుర్తింపు వచ్చేలా తీర్చిదిద్దారు. అయితే రామారావుకు మంచి పేరు రావడం ప్రిన్సిపాల్ సహించలేకపోయారు. దీంతో గత ఏడాది విద్యార్థులను జిల్లా స్థాయి క్రీడలకు పోనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులను క్రీడలకు ఎందుకు పంపరని ప్రిన్సిపాల్‌ను పీడీ ప్రశ్నించారు. అప్పటి నుంచి కక్ష పెట్టుకున్న ప్రిన్సిపాల్..పీడీ విధులకు భంగం కలిగిస్తూ వస్తున్నాడు. జిల్లా స్థాయి పోటీలకు పిల్లలను పంపకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను అడిగారు. దీంతో అప్పటి నుంచి తోటి ఉద్యోగి అన్న గౌరవం లేకుండా అందరి ముందు దుర్భాషలాడుతున్నాడు.


ముండ్లమూరు మోడల్ స్కూల్

**విధుల్లోకి రానివ్వకుండా అడ్డగింత**

ఈ క్రమంలో నెల రోజులుగా పీడీ పాఠశాలకు రాకుండా ప్రిన్సిపాల్ అడ్డుకుంటున్నాడు. గేటు బయట వాచ్‌మెన్‌లు పెట్టి పీడీ లోపలికి రానివ్వడం లేదు. దీంతో ఏడు ఏళ్లుగా ఏ పాఠశాలలో విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయిలో తీర్చిదిద్దారో..అదే పాఠశాలలోకి ప్రవేశం లేక దీనంగా పాఠశాల గేటు బయట ఎదురుచూస్తున్నారు. ఇటీవల పాఠశాలలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వాచ్‌మెన్లు దాడి చేసి ఫోన్ పగులగొట్టారని పీడీ వాపోయారు. ప్రిన్సిపాల్ వ్యవహార శైలి పట్ల తల్లిదండ్రులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నన్ను ఎవరేం చేస్తారనే భావనలో ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని, విద్యా శాఖ ఉన్నతాధికారులు అతనిపై చర్యలు తీసుకోకుంటే మా పిల్లలను స్కూల్‌కు పంపమని చెబుతున్నారు.

**విధుల్లోకి తీసుకోమని చెప్పాం: కిరణ్‌కుమార్, డీఈఓ**

ఈ విషయమై డీఈఓ కిరణ్‌కుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా..గతంలోనే పీడీ రామారావును విధుల్లోకి చేర్చుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించాం. కానీ చేర్చుకోలేదు. విద్యార్థుల క్రీడా భవిష్యత్ నాశనం అవుతుందని ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావుకు షోకాజ్ నోటీసులు కూడా ఇచ్చాం. ఉన్నతాధికారులు సైతం తెలియజేశాం. ఉన్నతాధికారుల నివేదిక ఆధారంగా తదుపరి ముందుకు వెళతాం.

## ఏ ఒక్కరూ బాధ్యతలు విస్మరించరాదు

- జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్

**ఒంగోలు సబర్బన్:** కార్మికులు, వాహనదారులు ఏ ఒక్కరూ బాధ్యతలు విస్మరించరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. స్థానిక వెంగముక్కల రోడ్డులోని రవాణాశాఖ డీటీసీ కార్యాలయంలో బుధవారం వాహనాల యజమానులకు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కుల గురించి పోరాటం చేస్తుంటారని, కానీ బాధ్యతల గురించి పట్టించుకోరని గుర్తు చేశారు. వాహనదారులు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి వ్యక్తి వెనుక ఒక కుటుంబం ఉంటుందన్న విషయాన్ని విస్మరించకూడదన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలను పాటించాలన్నారు. ప్రమాదాల నివారణే లక్ష్యంగా రవాణా శాఖ అవగాహన కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల, డిప్యూటీ లేబర్ కమిషనర్ భవాని, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నరిశింగరావు, బాలల హక్కుల పరిరక్షణ అధికారి దినేష్‌కుమార్, జేజే బోర్డు లీగల్ అడ్వైజర్ రత్నప్రసాద్, న్యాయ సేవ సహాయకులు వావిలాల సదాశివశాస్త్రి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఏ కిరణ్ ప్రభాకర్, ఎల్.సురేంద్ర ప్రసాద్, ఏఎంవిఐ కే.జయ ప్రకాష్, యు.ధర్మేంద్ర, బి.భాను ప్రకాష్, డి.జశ్వంత్, పరిపాలనాధికారులు డి.సుధాకర్, ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్